# సింగరేణి ప్రధాన కార్యాలయంలో

# ఉత్సాహపూరితంగా బతుకమ్మ సంబురాలు

- పాల్గొన్న సిఎండి బలరాం

**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు ఉత్సాపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. శుక్రవారం పెద్ద ఎత్తున మహిళా అధికారులు, ఉద్యోగినులు, మహిళా సిబ్బంది బతుకమ్మ ఉత్సవంలో సందడి చేశారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు డైరెక్టర్ ఈ అండ్ ఏం సత్యనారాయణ, జి ఎం లు పాల్గొన్నారు







# కలెక్టరేట్‌లో 3వ రోజు

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం,కలెక్టరేట్, నవభూమి, అక్టోబర్ 04:** కలెక్టరేట్ లో మూడవరోజు శుక్రవారం సాయంత్రం ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లోని వివిధ శాఖల లోని అధికారులు, సిబ్బంది బతుకమ్మను పేర్చి పాలు, చక్కెర, పెసలు, సత్తుపిండి, బెల్లంతో నైవేద్యం సమర్పించి పెద్ద ఎత్తున ఉద్యోగులు, మహిళలు వేడుకల్లో పాల్గొని గౌరమ్మ తల్లిని పూజించి, ఆట, పాటలతో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఇట్టి వేడుకల్లో జిల్లా వైద్య, ఆరోగ్య



శాఖాధికారి డా. సుబ్బారావు, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. సైదులు, వైద్యాధికారులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.










# రూ. 6.80 కోట్ల విలువైన

# గంజాయి కాల్చివేత

- వివిధ కేసుల్లో పట్టుబడిన 1611.947 కేజీల గంజాయి

**ఖమ్మం నగరం, నవభూమి, అక్టోబర్4:** ఖమ్మం జిల్లాలోని నాలుగు పోలీస్ స్టేషన్లోని గంజాయిని డిస్ట్రాయిడ్. ఖమ్మం ఎక్సైజ్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్లో పరిధిలో 1611.94 కిలోల గంజాయిని దహనం చేశారు. ఖమ్మం జిల్లా ఐ ఎన్ టి సి కాంప్లెక్స్ లోని ప్రభుత్వ అనుమతి పొందిన ఏడబ్ల్యూఎమ్ కన్సల్టింగ్ కేంద్రంలో అసిస్టెంట్ కమిషనర్ జి గణేష్ ఆధ్వర్యంలో గంజాయిని దగ్ధం చేశారు. దగ్ధం చేసిన గంజాయి విలువ రూ. 6.80 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.



నవభూమి

జిల్లా అనుబంధం

05 అక్టోబర్,2024 శనివారం పేజీలు:10

www.epaper.navabhoomi.in


# జ్వరంతో వచ్చాడు..

# శవమై వెళ్లాడు

- రూ.23 వేల బిల్లు !!
- పేరుకే మల్టీ స్పెషాలిటీ బోర్డులు - వైద్యం కరువు
- కొత్తగూడెంలో ప్రవేట్ ఆసుపత్రుల తీరు
- అవసరం లేకపోయినా పరీక్షలు



**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** జ్వరాల సీజన్, అత్యవసర పరిస్థితి కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తోంది. జిల్లా అధికార్ల పర్యవేక్షణ కరువు కావడంతో, కొందరు ఆర్ ఎం పి లను ఊర్లలో ఏజెంట్లుగా పెట్టుకుని డబ్బులు సంపాదనే ధ్యేయంగా ప్రైవేట్ ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. అవగాహన లోపంతో రోగులు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలనుండి వచ్చి డబ్బులు ప్రాణాలు రెండు పోగొట్టుకుంటున్నారు. కొన్ని ప్రవేట్ ఆసుపత్రిలో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. రోగి పరిస్థితిని బట్టి ఇష్టం వచ్చినట్టు డబ్బులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా జ్వరాల సీజన్ వచ్చిందంటే డెంగ్యూ, ప్లేట్లెట్స్ పడిపోతున్నాయని రోగులను భయభ్రాంతులకు గురి చేసి కొందరు లక్షల్లో బిల్లులు వేస్తున్నారు. సాధారణంగా ఐదు రోజుల తర్వాత జ్వరం వస్తే తర్వాత గాని పరీక్షలు చేస్తారని ఓ సీనియర్ డాక్టర్ చెప్పారు. అలాంటిది వచ్చి రాగానే పరీక్షలు చేసి ప్లేట్లెట్స్ పడిపోతున్నాయి అంటూ అందిన కాడికి గుంజుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. డెంగ్యూ పరీక్షల్లోను ఒక్కో ల్యాబ్లో ఒక విధంగా రిపోర్ట్ లు వస్తుండడంతో ఏది సరైన రిపోర్ట్ అనేది అర్థం కావడం లేదు.

నాలుగు రోజులుగా జ్వరం వస్తుండడంతో చంద్రుగొండకు చెందిన తిరుపతిరావును కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్ ప్రాంతాల్లో ప్రైవేట్ ఆసుపత్రికి గురువారం రాత్రి తీసుకువచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున తిరుపతిరావు చనిపోయాడు. అప్పటివరకు రూ.13 వేలు కట్టించుకున్నారు. ఇంకో పదివేలు చెల్లించి మృతదేహం తీసుకువెళ్లాల్సిందిగా చెప్పారు. తిరుపతిరావు తరపున బంధువులు పదివేలు చెల్లించలేము ఐదు వేలు చెల్లిస్తాం అన్న కనికరించని ఆసుపత్రి యాజమాన్యం. రాత్రి నుండి ఇప్పటివరకు ఎలాంటి ట్రీట్మెంట్ అందించారు, ఇన్ని వేలు రూపాయలు ఎందుకు అని మృతుడి తరపున బంధువులు ప్రశ్నించిన ఆసుపత్రి యాజమాన్యం సమాధానం ఇవ్వని పరిస్థితి.ఆఖరికి మృతదేహాన్ని అప్పగించారు. అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కొత్తగూడెంలోని ఏజెన్సీ ప్రాంత ఎక్కువగా ఉండడం చుట్టుపక్కల పేద ప్రజలు వారికి సరైన అవగాహన లేకపోవడంతో వైద్యులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని మేనేజ్మెంట్ ఆసుపత్రులు వచ్చాయి. దీంతో రోగి రాగానే అవసరం లేకపోయినా పరీక్షలు చేయిస్తూ రూ.5 వేల బిల్లు కచ్చితంగా వేస్తున్నారు. పేరుకే మల్టీస్పెషల్టి బోర్డులో అందుకు తగ్గట్టు వైద్యం,పరికరాలు,ఉండటం లేదు. ఆస్పత్రిలో ఎక్కడ కనబడని ధరల పట్టిక,అర్హతకు మించి వైద్యం అందిస్తూ ఆఖరి నిమిషంలో రోగులను బయటకు హైదరాబాద్ పంపేస్తున్నారు. లేదా చనిపోతే మృతదేహాలు అప్పగిస్తున్నారు. గ్రామాల్లోకి ప్రాథమిక స్థాయిలో మంచి అవగాహనా కల్పించి కనీస వైద్యం అందించాల్సిన అవసరం ఉంది.

# మండల కార్యదర్శుల కమిటీ ఎన్నిక

**కారేపల్లి, నవభూమి,అక్టోబర్4 :** కారేపల్లి మండలం గ్రామపంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీను శుక్రవారం ఎన్నుకున్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో మండల అధ్యక్షులుగా నెహ్రు, ప్రధాన కార్యదర్శిగా హరి, ఉపాధ్యక్షులుగా మద్దెల వెంకటేష్, కోశాధికారిగా కొత్తపల్లి అనూష, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెంద్ర అనిల్‌కుమార్, గౌరవ సలహాదారులుగా కొండపల్లి అనిల్, రామకృష్ణలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎంపీవో రవి ప్రసాద్‌కు సమస్యలతో కూడిన



వినతిపత్రాన్ని అందజేశారు. పని ఒత్తిడి తగ్గించాలని, గ్రామపంచాయతీలకు నిధులు వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రతి కుటుంబం వివరాలను పక్కాగా సేకరించాలి

### అదనపు కలెక్టర్ డి. మధు సూదన్ నాయక్

### ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్





**ఖమ్మం/ కూసుమంచి, నవభూమి, అక్టోబర్ 04:** ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టు క్రింద ఎంపికైన గ్రామాలలో ప్రతి కుటుంబం వివరాలను సజావుగా సేకరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం ధర్మతండాలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సర్వే ద్వారా కుటుంబాల నుంచి సేకరిస్తున్న వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో కుటుంబం దగ్గర నుంచి సేకరించాలని, గ్రామంలో ఏ కుటుంబాన్ని విడిచిపెట్టకుండా ప్రతి ఒక్కరి వివరాలను పకడ్బందీగా సేకరించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 85 వేల ఎల్ ఓసీ అందజేసిన ఎమ్మెల్యే జారే

**దమ్మపేట అక్టోబర్ 4 నవభూమి:** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన గోనెల రాజా కుమార్తె అనారోగ్యంతో బాధ పడుతూ ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక మండల నాయకులు పర్వతనేని వరప్రసాద్ సాయిల నరసింహారావు ఇరువురు కలిసి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఆర్థిక పరిస్థితి గమనించి పాపకు సర్జరీ నిమిత్తం 85000 రూపాయలు అవసరం అవ్వగా వెంటనే ఎల్ ఓసీ మంజూరు చేసి స్థానిక నాయకులు పర్వతనేని వరప్రసాద్, సాయిల నరసింహారావును వెంట పెట్టుకొని శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఎల్ ఓసీ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు రావు గంగాధర్ రావు చిన్నంశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, పర్వతనేని వరప్రసాద్, సాయిల నరసింహారావు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, రఫీ పాషా తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలో మౌలిక వసతులు కల్పన పనులు

# 14వ వరకు పూర్తి చేయాలి

■ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్





**కొత్తగూడెం (భద్రాచలం) అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా జరుగుతున్న పనులు అనగా జిపిఎస్ పాఠశాలలో పిల్లలకు మౌలిక వసతులు కల్పించడానికి వీవోల ద్వారా ప్రారంభించిన పనులు ఈనెల 14వ వరకు పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో ఐటీడీఏ డీఈలు, ఏఈ లతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గిరిజన సంక్షేమ శాఖ ప్రైమరీ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు మైనర్ రిపేర్లు, మంచినీటి సౌకర్యం మరియు కరెంటు, మౌలిక వసతులకు సంబంధించిన పనులకు సంబంధించిన ప్రగతిని మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ప్రైమరీ స్కూల్లో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి పాఠశాలలో మంచినీరు సౌకర్యం, దానికి సంబంధించిన ప్లాట్ఫామ్ ,పంపింగ్, మైనర్ రిపేర్లు, ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ పనులు అలాగే టాయిలెట్స్, బాత్రూంలు, పిల్లలు సరిపోయే విధంగా గుర్తించి ప్రారంభించిన పనులు పూర్తయినవి, కాక మిగిలిపోయిన పనులు దసరా సెలవులకు పిల్లలు ఇండ్లకు వెళ్లినందున వారు తిరిగి పాఠశాలకు వచ్చేనాటికి ఏ పని పెండింగ్లో లేకుండా పనులు పూర్తి కావాలని అన్నారు. వివో ల ద్వారా మిగిలిపోయిన పనులు ఎంతవరకు జరుగుతున్నవి, సంబంధిత ఏ ఈ, డి ఇ లు ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలలకు సంబంధించి పూర్తి కాక మిగిలిపోయిన పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 14 వరకు పూర్తిచేసి దానికి సంబంధించిన బిల్లులు ఈ నెల 31 వరకు అందజేయాలని, ఖమ్మం జిల్లాలో జరుగుతున్న పనులు ఈ నెల 31 వరకు పనులు పూర్తి చేసి, నవంబర్ 10 వరకు బిల్లులు తప్పనిసరిగా అందించాలని, లేనిచో సంబంధిత ఏ ఈలపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆది ఆవాస్ యోజన కింద జరుగుతున్న పనులు గ్రామపంచాయతీ భవనాలు, అంగనవాడి సెంటర్లు, మరియు గురుకులలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు తొందరగా పూర్తి కావాలని, సంబంధిత డీఈలు, ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని పనులు చేయించాలని అన్నారు. భూ సమస్య ఏమైనా ఉంటే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోవాలని, పనులు మాత్రం త్వరితగతిన ప్రారంభించి గడువు నాటికి పూర్తి చేయాలని అన్నారు. వచ్చే నెలలో తిరిగి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు పెండింగ్లో లేకుండా పూర్తిస్థాయి ప్రగతి చూపెట్టాలని లేనియెడల ఏఈలు డి ఈ లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# సోలార్ మోడల్ గ్రామంగా సిరిపురం

■ మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్

■ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి







**ఖమ్మం, నవభూమి బ్యూరో, అక్టోబర్4:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్ర మార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గం లో పైలట్ ప్రాజెక్ట్ కింద సోలార్ మోడల్ గ్రామంగా సిరిపురం ను ఎంపిక చేయడం జరిగిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం మధిర అసెంబ్లీ నియోజకవర్గంలోకి సిరిపురం గ్రామంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీ అనిలా వావిళ్ళ , ఖమ్మం ఎస్ఈ , ఏ .సురేందర్ , జీయం ఐపీసీ మల్లికార్జున్, పంచాయితీ , వ్యవసాయ అధికారులు పర్యటిస్తూ పలువురు గ్రామస్థులు , రైతులతో పైలట్ ప్రాజెక్ట్ గురించి వివరించారు. సిరిపురం గ్రామంలో దాదాపు 1039 గృహ వినియోగదారులు, 520 వ్యవసాయ వినియోగదారులు ఉన్నారని అన్నారు. విద్యుత్ శాఖ , రెడ్కో ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగిందని అన్నారు. ఈ సర్వేలో గృహ వినియోగదారుల సర్వే పూర్తి అయ్యిందని , వ్యవసాయ సర్వీసుల సర్వే సగం పూర్తి అయ్యిందని, మిగతా సర్వీసుల సర్వే మరో మూడు రోజుల్లో పూర్తి అవుతుందని అన్నారు .ఈ సర్వీసుల వివరాలను పిఎం సూర్య ఘర్ పోర్టల్ లో నమోదు చేస్తున్నామని వివరించారు . సిరిపురం లోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగహన సదస్సులో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులకు , రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ లు పెట్టాలని , అలాగే వ్యవసాయ పంపు సెట్ల కు కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో అవగాహన కల్పించామన్నారు . సౌర ప్యానెల్స్ ప్రాముఖ్యత గురించి వివరించామని , పైలట్ ప్రాజెక్టు క్రింద సిరిపురం గ్రామాన్నిఉప ముఖ్యమంత్రి , విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్ర మార్క,మధిర నియోజకవర్గం లో చేపట్టడం జరిగిందని, ఆదర్శ గ్రామంగా సిరిపురం నిలుస్తుందని పేర్కొన్నారు . ఏ విధమైన ఆర్థిక భారం లేకుండా ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నామని తెలియజేశారు. సౌర ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వినియోగదారులు మిగిలిన విద్యుత్తును డిస్కంకు విద్యుత్ సరఫరా చేయవచ్చని తద్వారా ఆదాయం లభిస్తుందన్నారు . ఆర్థిక ప్రయోజనాలు , స్వయం సమృద్ధిగా దిశగా ఎదుగుతారన్నారు . సౌర ప్యానెల్స్ ఏర్పాటుకు తగిన రూఫ్ లేని 201 గృహ సేవల కోసం, టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీ అనిలా వావిళ్ళ తో మాట్లాడి హై-రైజ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించమని సూచించారు. సమీప రైతులు ఒక వేదికగా చేరి, ఒకే ప్రదేశంలో సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు అని అన్నారు . ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పునరుత్పాదక శక్తి ప్రోత్సహించడం, స్థానిక గ్రామస్థులకు ఆర్థిక ప్రయోజనాలను అందేలా చేయడం మరియు పర్యావరణ పరిరక్షణను సాకారం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు . బొగ్గు తదితర శిలాజా ఇంధనాల ద్వారా పర్యావరణనికి హాని కలగడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తుందని ఇలాంటి దుష్ పరిణామాలను నివారించడానికి సౌర విద్యుత్ ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ సందర్భంగా వివరించారు. కావున ప్రతి ఒక్కరూ పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన సిరిపురం గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయగలరని కోరారు

## పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారె





**ములకలపల్లి అక్టోబర్ 4 నవభూమి:** ములకలపల్లి మండలంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మరియు పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు సులభతరంగా అందించేందుకు అన్ని పథకాలు ఒకే కార్డ్ మీద అందించాలానే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అందులో భాగంగా శుక్రవారం నాడు పైలట్ ప్రాజెక్ట్ గా మండల పరిధిలో ముత్యలంపాడువోగ్రామంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.గ్రామస్తులకు పూర్తి అవగాహన కలిగించి వారి నుంచి వివరాలు సేకరిస్తూ డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు.అలాగే అకస్మాత్తుగా ఏకలవ్య పాఠశాలను ఎమ్మెల్యే జారే అది నారాయణ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, ముఖ్యనాయకులు,స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్‌లో సీటుసాధించిన జన్నారం విద్యార్థిని



**ఏనుకూరు, నవభూమి, అక్టోబర్ 4 :** ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాల్లో మండల పరిధిలోని జన్నారం గ్రామానికి చెందిన పగిడిపల్లి మాధవి అనే విద్యార్థి ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించింది. మాధవి పదో తరగతి వరకు బూర్గంపహాడ్ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ కమ్మలోని ప్రైవేట్ కాలేజీలో చదివింది పదవ తరగతిలో 10/10 మార్కులు సాధించి ఇంటర్మీడియట్ లో సైతం స్టేట్ ర్యాంకు పొందింది. జనగామ లోని ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు శ్రీను,లక్ష్మి కూలి పని చేస్తూ మాధవిని ఎంతో కష్టపడి చదివించారు. వారి కష్టానికి ఫలితంగా మాధవి సైతం మొదటి నుండిచదువులో ఎంతో ప్రతిభ చూపిస్తూ కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించింది.

## 8న గార్ల ఒడ్డు దేవస్థానంలో బహిరంగ వేలం పాట

**ఏనుకూరు, నవభూమి, అక్టోబర్ 4:** మండల పరిధిలోని గార్ల ఒడ్డు లో గల శ్రీ లక్ష్మీనరసింహ దేవస్థానంలో గల వివిధ రకాల దుకాణాలపై ఈనెల 8 న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్ వి డి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా కొబ్బరికాయలు పూజా సామాన్లు, ,పాలు, బెల్లం, బియ్యంతో పాటు కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనుట,తదితర వాటిపై బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు .పాటలు పాల్గొనదలచిన వారు11 గంటలకు దేవస్థానం వద్దకు రావాలని సూచించారు. పాట దక్కించుకున్న వారికి రెండు సంవత్సరాలు పాటు ఉంటుందన్నారు వేలంపాట దక్కించుకున్న వారు దేవాదాయ శాఖ చట్టం అనుసరించి అధికారుల ఉత్తర్వులకు లోబడి పని చేయాల్సి ఉంటుందని తెలిపారు

## నిబంధనలు ఉల్లంఘించిన

# నలుగురి వాహనదారుల లైసెన్స్‌లు రద్దు

- నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే ఇక సీజ్
- పరిమితిని మించి ప్రయాణికులతో వాహనాలు నడపకండి
- మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు
- కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కే నరేష్





**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** అతివేగం ఇతరుల ప్రాణానికి హాని కలిగిస్తుందని కొందరు వాహనదారులు నిర్లక్ష్యంగా రోడ్లపై వాహనాలు నడుపుతూ ఇతర ప్రయాణదారులకు ప్రాణ సంకటాన్ని కల్పిస్తున్నారని ఇకనుంచి కొత్తగూడెంలో ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించి అతివేగంగా వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేశామని, అతిగా మద్యం సేవించి విచ్చలవిడిగా వాహనదారులు వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని శుక్రవారం కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కే నరేష్ హెచ్చరించారు. కొత్తగూడెంలో పలు ప్రాంతాల్లో రద్దీ ఉన్న ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జిల్లా ఎస్పీ డిఎస్పి ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్ లేని వాహనాలను, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని, పట్టుకొని పూర్తిస్థాయిలో వాహన పత్రాలను పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన నలుగురు వాహనదారుల లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెంలో ట్రాఫిక్ నిబంధనలు కటువుగా అమలు చేస్తామని కేవలం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కు వాహనదారులు ప్రజలు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో వాహనదారులకు ప్రభుత్వ ఉద్యోగులకు యువతకు ట్రాఫిక్ అనుసరించు విధానాలపై అనేక అవగాహన సదస్సులు ఏర్పటు చేశామని అయినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వహించి పోలీసులు నిబంధనలను అతిక్రమిస్తూ రోడ్డు ప్రమాదాలలో వారి అమూల్యమైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు. ప్రధానంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలపై దృష్టి సారించామని ఈ విషయంలో ప్రభుత్వ శాఖల ఉద్యోగులైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణించే వారికి అనేక నష్టాలు వాటిల్లుతున్నాయని ఈ విషయంలో ప్రయాణకులు తప్పకుండా పోలీస్ సూచనలు పాటించాలని సూచించారు. పాఠశాలలు విడిచే సమయంలో చిన్నారులు రోడ్డు దాటుతూ ఉంటారని ఆ సమయంలో యువత విచ్చలవిడిగా అతివేగంగా వాహనాలు నడుపుతూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇలాంటి వారిపై ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా అమలు చేసి లైసెన్సులు రద్దు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి రోడ్డులో యూనియన్ బ్యాంకు పక్కన బార్ వల్ల ఏర్పడుతున్న రద్దీ, అడ్డగోలు పార్కింగ్ పై ట్రాఫిక్ ఎస్సై దృష్టి సారించారు. ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం తో పాటు అక్కడ వాహనాలు పార్క్ చేయకుండా చర్యలు తీసుకున్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె







**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి /దమ్మపేట /అశ్వారావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు సులభతరంగా అందించేందుకు అన్ని పథకాలు ఒకే కార్డ్ మీద అందించాలానే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శుక్రవారం పైలట్ ప్రాజెక్ట్ గా దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబందిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామస్తులకు పూర్తి అవగాహన కలిగించి వారి నుంచి వివరాలు సేకరిస్తూ డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, స్థానిక నాయకులు, అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

**అశ్వారావుపేటలో–**

అశ్వారావుపేట లో కలెక్టర్ జితేష్ బి పాటిల్ శుక్రవారం పర్యటించారు. ఏరియా హాస్పిటల్ ని పరిశీలించిన కలెక్టర్ మౌలిక వసతులపై సిబ్బందికి సూచనలు చేశారు. స్థానిక వ్యవసాయ కళాశాల సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు బోధన తో పాటుగా రైతాంగానికి కూడా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కళాశాల సిబ్బంది కి సూచిస్తూ, తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే కూరగాయల మేలు జాతి విత్తనాలు, మొక్కలు రైతులకు అందించే ఏర్పాటు చేయాలని, వాటికి నిధులు ఇస్తానన్నారు. ఇటీవల క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం దమ్మపేట, ముల్కలపల్లి మండలాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డిజిటల్ కార్డు స్పెషల్ ఆఫీసర్ సుమ తో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# డాక్టర్ బత్తినేనిని పరామర్శించిన కోయ



**ఖమ్మం రూరల్, నవభూమి, అక్టోబర్ 3:** మండలంలోని తల్లంపాడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు డాక్టర్ బత్తినేని వెంకటేశ్వరరావును తెలంగాణ పబ్లికేషన్స్ అధినేత కోయ చంద్రమోహన్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బత్తినేని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ పబ్లికేషన్స్ ప్రచురించిన భారతదేశపు ఆంటోనియా గ్రాంసీ ఏచూరి అనే పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యామిని ఉపేందర్, బత్తినేని రంగారావు, వట్టికోట నరేష్, ఇరుకులపాటి నాగేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ విద్యార్థినిని సన్మానించిన నవ చైతన్య యువజన సంఘం



**గుండాల అక్టోబర్ 4 నవభూమి:** గుండాల మండలం పాలగూడెం గ్రామానికి చెందిన వజ్జ వీర కుమారి వైద్య విద్య ఎంబిబిఎస్ లో సీటు సంపాదించడం గర్వకారణమని, పట్టుదలతో చదివి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని వక్తలు ఆకాంక్షించారు. ఎంబిబిఎస్ పూర్తయ్యే వరకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతమైన గుండాల మండలంలో యువత నైపుణ్యాన్ని వెలికితీయడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యూత్ ఇల్లందుల నరసింహులు, గడ్డం లాలయ్య, అజ్జు, సంతోష్, సతీష్, సునీల్, వినయ్, సతీష్, ప్రశాంత్, మహేష్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు

# సిఎన్ఎండి బలరాం నాయక్‌కు ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలిపిన ఎండి రజాక్

**రుద్రంపూర్ అక్టోబర్ 4 నవభూమి:** విదేశాలకు వెళ్లి తిరిగి స్వదేశమునకు వచ్చిన సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ కి శుభాకాంక్షలు తెలుపుతూ వారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, జే వి ఆర్ ఓసి, జే వి ఆర్ సి హెచ్ పి, కిష్టారం ఓసి ఐఎన్టీయూసీ బృందం



# సాటి మనిషిని హాని తల పెట్టకుండా ఉండడమే నిజమైన దైవభక్తి

■ అబ్దుల్ బాసిత్



**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** సాటి మనుషులకు హాని కలిగించకుండా, వారి సుఖసంతోషాల కోసం కృషి చేయడమే నిజమైన దైవ భక్తి అని జమాతే ఇస్లామీ హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా స్థానిక 12 వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్, రామవరం లోని మస్జిద్ ఏ ఆలి లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేల పై ఉన్న వారిని కరుణించు, నింగి లో ఉన్న వాడు నిన్ను కరుణిస్తాడు, సాటి మనిషిని కష్టాల్లో అదుకుంటే దైవం మీ కష్టాలు దూరం చేస్తాడు అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన బోధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తే సమాజం లో శాంతి సామరస్యాలు వెల్లివిరిస్తాయని అన్నారు. వితంతువుల, అనాథల,



అగత్య పరుల, సేవ రాత్రంతా నమాజ్, పగలంతా ఉపవాసం పాటించేవారు, ధర్మ స్థాపన కోసం దైవ మార్గం లో ప్రాణాలు అర్పించిన వారితో సమానంగా అని ప్రవక్త ముహమ్మద్ తెలిపారని కనుక మానవ సేవయే నిజమైన మాదవ సేవ అని గ్రహించి సమాజ సేవకు నడుము బోధించాలని కోరారు. చెడులకు దూరంగా ఉంటూ సమాజం లో మంచిని పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదే నిజమయిన ఆరాధన, దైవభక్తి అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు బాబా, సెక్రెటరీ మస్తాన్, జావిద్, అఫ్జల్, అఫ్నాన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 6 లోపు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

- ■ అదనపు కలెక్టర్ డి. మధు సూదన్ నాయక్
- ■ అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు కొత్తగా తమ పేరును ఓటర్‌గా నమోదు చేసుకోవాలి
- ■ ఎమ్మెల్సీ ఓటర్ జాబితాపై ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్

**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, అక్టోబర్ 04:** నవంబర్ 6 లోపు వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్ – ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం అక్టోబర్ 16, 25 తేదీలలో వార్తా పత్రికలలో మొదటి, రెండవ రిపబ్లికేషన్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన ఉపాధ్యాయులు నవంబర్ 6 లోపు ఫారం 19 ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కొరకు దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి, డిసెంబర్ 25 లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తామని, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి



ఓటర్ల జాబితాలను ఎన్నికల ముందు ప్రతిసారి కొత్తగా తయారు చేస్తామని, గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఫారం 19 ప్రకారం నూతనంగా దరఖాస్తును నవంబర్ 6 లోపు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. 2024 నవంబర్ 1 కి ముందు 6 సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాల పాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధనలో నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునే ఉపాధ్యాయులు గత ఆరు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు విద్య బోధన చేసినట్లు సంబంధిత విద్యా సంస్థ నుంచి ధృవీకరణ సర్టిఫికెట్ జత చేయాలని అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఫారం 19 ప్రకారం తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు మాన్యువల్ గా లేదా %ఎవశీవశ్రీఖఅస్త్రుఖఐ.అఱఎ.అఱ% అనే వెబ్ సైట్ లో ఆన్లైన్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విశ్వశాంతిలో బతుకమ్మ సంబరాలు పూల పండుగ



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 4 :** తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలను ప్రతిభింబించే బతుకమ్మ సంబరాలు శుక్రవారం విశ్వశాంతి విద్యాలయంలో ఘనంగా జరిగాయి. మహిళా టీచర్లు, బాలికలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను శోభాయ మానంగా తయారు చేశారు. వాటికి గౌరీ పూజ అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ లయ బద్ధంగా కోలాట నృత్యం చేశారు. ఒక్కేసి పువ్వేసి చందమామ...బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల.... తదితర బతుకమ్మ విశిష్టతను తెలిపే పాటలు ఆలోచింపజేశాయి. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలను దేవునితో సమానంగా చూసే సంస్కృతి మనదన్నారు. అందుకే బతుకమ్మ వేడుకలకు




పూల పండుగ, మహిళల పండుగ గా ప్రసిద్ధికెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు బతుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కోలాట నృత్యంలో పాల్గొన్నారు. కోలాటం మాస్టర్ తరిక మల్ల నరేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి

# చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి: సిపిఎం పార్టీ డిమాండ్




**చర్ల అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో బివిస్ రామయ్య భవనంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముందుగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు దేశి బాబురావు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం మండల సమస్యల మేరకు చర్లలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షా కేంద్రం లేదు దీనికి గాను కొయ్యూరు ఆసుపత్రికి వెళ్లే రక్త పరీక్ష చేయించుకోవడం ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. సుమారు రోజుకు100 నుండి 150 మంది పేషెంట్లు రావడం జరుగుతుంది. అందుకని ప్రజా శ్రేయస్సు కోరి కొయ్యూరులో ఉన్నటువంటి రక్త పరీక్ష కేంద్రాన్ని వారంలో మూడు రోజులు చర్ల ఆసుపత్రి నందు మరో నాలుగు రోజులు కొయ్యూరు ఆస్పటల్ నందు ఏర్పాటు చేయగలరని సిపిఎం పార్టీగా మేము డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు. లేనియెడల దశల వారి పోరాటాలు చేయడానికి సంసిద్ధంగా ఉన్నాను భవిష్యత్తులో డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ ని కూడా కలవడానికి సిద్ధంగా ఉన్నామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు శ్యామల చంద్రం, ఇరప ముత్తయ్య, పరిశిక సూరిబాబు, శ్యామల, కాంతయ్య, ముర్రం రామ్మూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు

# ఏరియా సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఎండి రజాక్



**రుద్రంపూర్ అక్టోబర్ 4 నవభూమి:** కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ నేతృత్వంలో ఏరియా జనరల్ మేనేజర్ గారిని ఐ ఎన్ టి యు సి నాయకులు కలిసి పివి కాలనీలో సమస్యల మీద వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనిపై జనరల్ మేనేజర్ గారు సానుకూలంగా స్పందించి పి వి కాలనీ లో కమ్యూనిటీ హాలు, సెక్యూరిటీ, ఓవర్ హెడ్ లైటింగ్, ఇతర మౌలిక వసతులు అతి త్వరలో మెరుగు పరుస్తా అని హామీ ఇచ్చారు పిఓ ప్రహ్లాద్ కి వెంటనే పూర్తి చేయాలని జిఎం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రాంతి కుమార్, రామారావు, నాగేశ్వరరావు, బాలాజీ, కోటేశ్వరరావు, సమ్మయ్య, కుమార్, రాజేశ్వరరావు, మురళి, యూసుఫ్, అంబ్రోస్, శ్రీధర్, దేవిడ్రాజు, కాజా భాష, రహిమాన్, ఐఎన్ టి యు సి నాయకులు పాల్గొన్నారు

# ఎంపీ వద్దిరాజు చేయూత

**హైదరాబాద్, అక్టోబర్ 4, నవభూమి ప్రతినిధి–** అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సీపీఆర్ఎఫ్ ద్వారా 2,00,000 రూపాయల చొప్పున లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) ఇప్పించారు, అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులు ఎంపీ రవిచంద్రను కలిసి చెప్పగానే ఆయన సానుకూలంగా స్పందించి సీఎంఆర్ఎఫ్ అధికారులకు సిఫార్సు చేశారు, ఈ మేరకు అధికారులు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పెదగోపతి నివాసి బీ.సత్యనారాయణ కూతురు హారికకు, ములకలపల్లి మండలం వేపలగడ్డకు చెందిన వై. సోమయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు 2,00,000 రూపాయల చొప్పున ఎల్వోసీ మంజూరు చేశారు,

# కాల్పులతో దద్దరిల్లిన దంతెవాడ

■ 36 మంది మావోయిస్టుల మృతి





**చర్ల అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ, చత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లో ఆపరేషన్ గ్రీన్ హాండ్ పేరుతో దంతవాడ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. సుమారు నాలుగు గంటల పాటు హెూరా హెూరీగా జరిగిన ఎదురు కాల్పుల్లో పద్నాలుగు మంది మావోయిస్టులు మృతి చెందినట్లు మరికొందరికి గాయాలైనట్లు, భారీగా ఆయుధాలు సామాగ్రి స్వాధీనం చేసుకోవడం జరిగిందని దంతవాడ జిల్లా ఎస్పీ తెలిపారు. గత నెలలో తెలంగాణ చర్ల మండలం పుసుగుప్ప పోలీస్ క్యాంపుపై మావోయిస్టులు ఒక్కసారిగా గ్రానైట్ లాంచర్లతో విరుచుకుపడిన ఘటన చూశాం. ఈసారి పోలీసులదే పై చేయిగా నిలిచింది. మావోయిస్టులు సమావేశం అయ్యారని పక్క సమాచారంతో నారాయణపూర్ దంతవాడ పోలీసులు ఆపరేషన్ గ్రీన్ హాంట్ పేరుతో కూంబింగ్ చేపట్టారు. అడవిలో సంచరిస్తున్న మావోయిస్టులు ఒక్కసారిగా పోలీసులపై కాల్పులు జరుపగా పోలీసులు వాటిని దీటుగా తిప్పికొడుతూ సుమారు నాలుగున్నర గంటల పాటు కాల్పుల మోతతో దద్దరిల్లిన దండకారణ్యం నారాయణపూర్ – దంతవాడ పరిసర ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఎప్పుడు ఏం జరుగుతుందని భయాందోళనలో ఉన్నారు. పోలీసుల కాల్పుల్లో చత్తీస్గడ్ సుకుమా జిల్లాలకు చెందిన ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారని భారీగా ఆయుధాలు స్వాధీనం చేశామని దంతవాడ జిల్లా ఎస్పీ నిర్ధారించారు ఏదేమైనా మావోయిస్టులకు గత సంవత్సరం కాలం నుండి ఎదురుదెబ్బ తగులుతూనే వస్తుంది. ఎన్ని ఎత్తుగడలు మావోయిస్టులు వేసిన ఎన్ని పన్నాగాలు పండిన పోలీసులదే పైచేయిగా నిలుస్తుంది. మరోపక్క చతిస్గడ్ పోలీసులు ఆదివాసీలను ఆకట్టుకునే కొన్ని కల్చరల్ ప్రోగ్రాలు చేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఆదివాసి ప్రజలకు దగ్గరవుతున్నారు. ఏదేమైనా ఎన్కౌంటర్ల వల్ల అమాయకపు ఆదివాసి గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురవుతూ గిరి పుత్రుల గుండెల్లో రోజురోజుకి రైళ్లు పరిగెడుతున్నాయని, చెప్పాలి దంతవాడ ఎస్పీ మావోయిస్టులకు సూచన చేశారు. మావోయిస్టులారా ఇప్పటికైనా జనజీవన స్రవంతిలోకి రండి మీ జీవితాన్ని ప్రజల్లోకి వచ్చి మార్చుకోండి మేల్కోండి అంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో చత్తీస్గడ్ సుకుమా పోలీసులు పాల్గొన్నారు. ఇంకా కొనసాగుతున్న కూంబింగ్

# దేశ రాజధాని స్థాయికి చేరిన బ్రిలియంట్ విద్యార్థిని

**బూర్గంపాడు అక్టోబర్ 4 నవభూమి:** బూర్గంపాడు మండలం సారపాక లో గల బ్రిలియంట్ విద్యాసంస్థల యందు గాంధీ నగర్ కు చెందిన సాహితీ అనే విద్యార్థిని నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు బ్రిలియంట్లోనే చదువుకొని దేశ రాజధాని అయిన ఢిల్లీలో గల ప్రముఖ గోయాంక యూనివర్సిటీ నందు ఫోరెన్సిక్ సైన్స్‌లో సీటు సాధించినందుకు బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బి ఎన్ ఆర్ సాహితీ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బి ఎన్ ఆర్ మాట్లాడుతూ సాహితీ ఢిల్లీలో గల ప్రముఖ యూనివర్సిటీ నందు ఫోరెన్సిక్ సైన్స్ లో సీటు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని మనం నాటిన మొక్కలు పెరిగి పెద్దవై మన ముందే పండ్లను ఇస్తే ఎంతో సంతోషంగా ఉంటుందని ఆ సంతోషాన్ని నేను ఇప్పుడు పొందుతున్నానని, బ్రిలియంట్ విద్యాసంస్థలు సారపాక పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులను మట్టిలోని మాణిక్యాలుగా ఎప్పుడూ తయారు చేస్తూనే ఉంటుందని తెలియజేశారు. అనంతరం సాహితీ అమ్మ తల్లి మాట్లాడుతూ నేను మా పాపని 4 సంవత్సరాల వయసులో బి ఎన్ ఆర్ సార్ కి అప్పజెప్పనుఅని, నేడు తనని ఢిల్లీలో ప్రముఖ యూనివర్సిటీ నందు సీటు వచ్చేలా తయారు చేశారని, ఇటువంటి గురువులకు ఏమిచ్చినా రుణం తీరదని భావోద్వేగంతో తెలియజేశారు. అనంతరం సాహితి మాట్లాడుతూ నన్ను ఈ విధంగా తయారుచేసిన గురుబ్రహ్మ అవార్డు గ్రహీత బి ఎన్ ఆర్ సార్ కి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ బి ఎన్ ఆర్ సార్



మార్గదర్శకంలో చదువుతున్న విద్యార్థులు అందరూ అదృష్టవంతులని అన్నీ తానే చూసుకునే గురువు దొరకటం నా పూర్వజన్మ సుకృతం అని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులాల్లో ముస్లిం మనోభావాలను దెబ్బ తీస్తున్నారు

■ ముస్లిం సంస్కృతులను గాలికి వదిలేస్తున్న సిబ్బంది

■ మైనారిటీ కమిషన్‌కు పిర్యాదు

■ మైనార్టీ జిల్లా అధ్య క్షులు ఎండీ యాకూబ్ పాషా

**పాల్వంచ అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** రాష్ట్రం లోని మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో ముస్లిం మనో భావాలు దెబ్బ తీసే విధంగా మైనార్టీ గురుకుల సిబ్బంది పనిచేస్తున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీ సంస్కృతిని కాపాడుతూ, మైనారిటీ లను విద్యా పరంగా, వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడ్డ మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో అనేక మంది మైనారిటీ యేతర సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నందున ముస్లింమే ఇతర పండుగలకు సంబంధించిన వాటిని జరుపుకోవటం, హిందూ దేవతల ఫోటోలు మైనారిటీ



విద్యా సంస్థలలో ఏర్పాటు చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు. దీని కారణంగా మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు. మైనారిటీ గురుకుల విద్యా సంస్థల లో ఇతర సంస్కృతిని ప్రోత్సాహించడం వలన మైనారిటీ విద్యార్దులు నష్టపోయే అవకాశం ఉందని, దీని దృష్టిలో పెట్టుకోని మైనారిటీ గురుకుల సంస్థ లలో ఇతర సంస్కృతిని ప్రోత్సహిస్తున్న సిబ్బంధిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్, మైనారిటీ గురుకుల కార్యదర్శి, ప్రభుత్వ సలహా దారుడు ఎండీ షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మైనారిటీ సంక్షేమ శాఖ, మైనార్టీ గురుకుల అధ్యక్షులు ఫహీం ఖురైషీ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎండీ యాకూబ్ పాషా తేలిపారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి గాయత్రి దేవి అలంకారం

## నవరాత్రుల రెండవ రోజు ప్రత్యేక పూజలు



**రుద్రంపూర్ అక్టోబర్ 4 నవభూమి:** శ్రీ దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని గాయత్రి దేవి రూపంలో అలంకరించి, ప్రత్యేక కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ సీతారామ దేవాలయం సంస్థానం లో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నవరాత్రుల ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని, భక్తులు ఆరాధన చేయడంతో ఆలయం పునీతమైంది. అమ్మవారి కుంకుమ పూజలు భక్తుల్లో ఉత్సాహం నింపాయి. గాయత్రి దేవి రూపంలో అమ్మవారికి అలంకారం నిర్వహించడంతో భక్తులంతా అమ్మవారి కృపకు పాత్రులయ్యారని విశ్వసిస్తున్నారు.

# భూ వివాదంలో ఒకరికి గాయాలు కేసు నమోదు



**ఎర్రుపాలెం, నవభూమి, అక్టోబర్ 4 :** మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో భూవివాదంలో శుక్రవారం జరిగిన దాడి ఘటనలో తుపాకుల శంకర్రావుకు గాయం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు బనిగండ్లపాడు గ్రామానికి చెందిన తుపాకుల శంకర్రావు సన్నాఫ్ వెంకటేశ్వర్లు, అన్నే రాంబాబు సన్నాఫ్ గాంధీ అనువారికి గత కొంతకాలంగా బనిగండ్ల పాడు రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 35/ ఆ/2 లో ఒక ఎకరం భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ భూమి వద్ద ఇరువురు గొడవ పడగా తుపాకుల శంకర్రావు తలకి రక్తపు గాయం అయింది. వెంటనే శంకరరావు ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రజలను నిట్ట నిలువునా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 4 (నవభూమి ప్రతినిధి):** అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నిట్ట నిలువున వంచించిందని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు లక్షల రుణమాఫీపై దేవుళ్లపై ఓట్లు వేసి కూడా మాట తప్పారని చెప్పారు. సంపూర్ణ రుణమాఫీ జరగకుంటే కాంగ్రెస్ ను రైతన్నలే సమాధి చేయడం ఖాయమని ధ్వజమెత్తారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం ఠంచనుగా ఏడాదికి రెండుసార్లు రైతుబంధు పంట సాయం అందించేదని గుర్తు చేశారు. ఎకరాకు రైతులకు, కౌలు రైతులకు రూ. 15 వేలు, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని చెప్పి నేడు నెరవేర్చకపోవడం సిగ్గుచేటని అన్నారు. రుణమాఫీ కోసం సగం మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని, వంకలు పెట్టి ఎగవేయాలని చూస్తే రైతులతో కలిసి ప్రభుత్వంపై తిరగబడతామని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగానే రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, పంటల కొనుగోలు సక్రమంగా చేయాలని, అన్ని పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు చీరాల రమేష్, ఆకుల యాదగిరి, పిఎసిఎస్ చైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి, కర్నే అరవింద్ పాల్గొన్నారు.



# ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు

- సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు డిజిటల్ కార్డు దోహదం
- ఫామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే





**పాల్వంచ అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయినీ, సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని బొల్లోరుగూడెం 10వ వార్డ్ లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టును సర్వే ప్రారంభించి, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు డిజిటల్ కార్డు దోహదపడుతుందని అన్నారు. ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇంటి వద్ద లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా, మరింత సమర్థవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్నట్ట చెప్పారు. వన్ స్టేట్ %-% వన్ కార్డు ఆలోచనతో చేపట్టిన ఈ బహుళ ప్రయోజన కార్డుల జారీ ప్రక్రియను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయినీ, అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డిఓ డి మధు, తహసీల్దారులు వివేక్, పుల్లయ్య, ఎంపీడీవోలు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ ఎస్ఐ సుమన్, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, డీ సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, జకరయ్య, లాల్ పాషా, ఆదినారాయణ, కిరణ్ రెవెన్యూ అధికారుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందు ఏజెన్సీ ప్రజలకు

# అందుబాటులో ప్రజా వైద్యశాల








**ఇల్లెందు అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** నల్లబంగారానికి పుట్టినిల్లు, సుధీర్ఘ చరిత్ర ఉన్న, నియోజకవర్గ కేంద్రమైన ఇల్లెందు పట్టణంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇంతకాలం నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేటి నుంచి ఆ ఇబ్బందులు తొలగిపోతున్నాయి. మంచి ఆధునిక సౌకర్యాలతో, ఉన్నత వైద్య విద్య ను అభ్యసించిన, అనుభవం కలిగిన డాక్టర్ లచే శనివారం ఇల్లెందు పట్టణంలో ప్రజా వైద్యశాల ప్రారంభం అవుతుంది. ఎంబిబిఎస్, ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్ జి. హర్షవర్ధన్, ఎంబిబిఎస్, ఎంఎస్, ఈ ఎన్ టి డాక్టర్ టి.రవి తేజశ్వి ల ఆద్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఈ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ లో గైనకాలజిస్ట్ డాక్టర్ ఏ సింధు, జనరల్ పిజిషియన్ డాక్టర్ జి. రాం నివాస్, రేడియాలజిష్ట్ డాక్టర్ డాక్టర్ పి.మాధురి తదితర యంగ్ డైనమిక్ డాక్టర్ ల బృందం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించనున్నారు. ఈ ప్రజా వైద్యశాలను నేడు శనివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించనుండగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎల్ భాస్కర్ నాయక్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ జి. రవి బాబు తదితరులు పాల్గొననున్నారు. కరోనా సమయంలోనూ, ప్రతి సంవత్సరం సీజనల్ వ్యాధుల సమయంలోనూ ఇల్లెందులో ఆధునిక వైద్య సౌకర్యాలు లేకపోవడంతో సుదూరంగా ఉన్న ఖమ్మం నగరానికి క్యూ కట్టేవారు. ఫలితంగా ఈ ప్రాంత పేద ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయేవారు. శనివారం ప్రారంభం కానున్న ప్రజా వైద్యశాలకు ఇల్లెందు ఏరియాలోని వివిధ రాజకీయ పార్టీల వారు, వ్యాపారస్తులు తమ సహాయ సహకారాలు అందిస్తూ పది కాలాలు పాటు ప్రజలకు సేవలు అందించేందుకు తమ తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్య శాలకు ఏదైనా అసాంఘిక శక్తుల నుండి ఇబ్బందులు ఎదురైతే, ఇలాంటి పెద్ద వైద్యశాల ఖమ్మం లాంటి ప్రాంతాలకు తరలిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ఎందుకంటే ఇటీవల మణుగూరు లో ఒక సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కు కొందరు బ్లాక్ మెయిలర్స్ ఫోన్ కాల్స్ వైరల్ అయ్యి పోలీసు కేసుల వరకు వెళ్ళాయి. వైద్య వృత్తిని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల దృష్టి తో చూసి పది కాలాల ఇల్లెందు ఏజెన్సీ ప్రజలకు సేవలు అందించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇల్లెందులో ప్రజా వైద్యశాల ప్రారంభం పట్ల అయితా శ్రావణ్ కుమార్, డాక్టర్ ఏ మాధురి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు పసుమర్తి లక్ష్మణరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

# కొత్తగూడెం -పాల్వంచ కార్పొరేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలి

**ఆదివాసి సంఘాల జేఏసీ ప్రభుత్వానికి డిమాండ్**

**అక్టోబర్ 28న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ముట్టడికి ఆదివాసి సంఘాల జేఏసీ పిలుపు**



**పాల్వంచ అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ కొత్తగూడెం - పాల్వంచ కార్పొరేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలని ఆదివాసి సంఘాల జేఏసీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణం లోని కొమరం భీం భవనంలో జరిగిన సమావేశంలో 1 /70 చట్టం పరిధిలో ఉన్న ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ చేస్తున్న ప్రతిపాదన చట్ట విరుద్ధం అన్నారు. కొత్తగూడెం - పాల్వంచ కార్పొరేషన్ ప్రతిపాదన 1/70 చట్లం కు తూట్లు పొడిచేందుకు కొంతమంది వ్యక్తులు రాజకీయ స్వలాభం కోసం ఆదివాసి హక్కులను చట్టాలను తుంగలో తొక్కుతూ భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ వల్ల మెజారిటీ ఏజెన్సీ ప్రాంతం కొత్తగూడెం చుట్టూ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు రాజకీయ పదవులు కోల్పోతామని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాలు పూర్తి ఏజెన్సీలో ఉన్నాయన్నారు. ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ కొత్తగూడెం -పాల్వంచ కార్పొరేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలిని నిరసిస్తూ ఈ నెల 28న జిల్లా వ్యాప్తంగా ఆదివాసులను సమీకరిస్తూ, భారీ స్థాయిలో కలెక్టరేట్ ను ముట్టడిస్తామన్నారు. జిల్లాలోని ఆదివాసులందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ప్రతిపాదన విరమిస్తూ పాల్వంచకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, ఆదిమ ఆదివాసి సంక్షేమ, హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోయం సత్యనారాయణ, జిఎస్ ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్, ఆదివాసీ నాయకులు సోయం బాలు, పద్దం నాగరాజు, ఊకే బుల్లిబాబు, కొమరం జగన్నాథం, సువర్ణబాక కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# జీడిమెట్ల పోలీసులకు అభినందనలు



**కుత్బుల్లాపూర్ , అక్టోబర్ 4: (నవభూమి ప్రతినిధి)** తప్పుడు డాక్యూమెంట్లు సృష్టించి వాళ్ళ భూములను లాక్కునే వాళ్ళను గుర్తించి వారిని అరెస్టు చెయ్యడం అభినందనీయమని పత్రికప్రకటనలో పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో కబ్జారాయులు అనేక ప్రభుత్వ భూములను కబ్జాచేసి ప్రజలకు తప్పుడు పత్రాలను చూపి లక్షలకు అమ్మి మోసం చేసారని,నేడు ఆ ప్రాంతాలో నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు హైడ్రా వచ్చి కూలుస్తోందొనని భయంతో బతుకుతున్నారని అన్నారు. ఆ సృష్టించిన పత్రాలు భూములు అమ్ముకోవడానికే కాకుండా ఆ పేపర్లతో ఎలక్ట్రిక్ మీటర్లు,టాక్స్ లు, మంచి నీటి కనెక్షన్,డోర్ నంబర్ లు ఇలాగ అన్నింటికి ఉపయోగించారని,కావున ఆ కబ్జాదారులను అరెస్టు చెయ్యడమే కాకుండా వాళ్ళ వల్ల మోసపోయిన వారిని గుర్తించి,కబ్జాదారులు మోసంతో పెంచుకున్న ఆస్తులను జప్తు చేసి ప్రజలకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేసారు.వాటి వెనుకాల ఉన్న అధికారులను అరెస్టు చెయ్యాలన్నారు. నేటికీ భూకబ్జాదారులు వాళ్లు కబ్జా చేసి కాలనీలుగా ఏర్పరిచి అందులో మధ్యలో ఖాళీగా ఉన్న స్థలాలలో గదులను నిర్మిస్తున్నారని,గతంలో సిపిఐ గా పోరాటం చేసి,విజ్ఞప్తుల పై ఇంకా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించట్లేదని,ఉద్యమాన్ని మరొకసారి నిర్మిస్తామని అన్నారు. అనేక ప్రాంతాలో నిర్మించిన బస్తిలో ఇలాగే అక్రమ పత్రాలను సృష్టించి ఉండవచ్చుని కావున వాటి పై కూడా సమగ్ర దర్యాప్తు చెయ్యాలని పత్రిక ప్రకటన ద్వారా పోలీస్ అధికారులను కోరారు. గతంలో చింతల్ చెరువు లో హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తే మళ్ళీ అక్కడ నిర్మాణాలు మొదలు పెట్టారని సమాచారం ఉందని, వాటి పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## సింగరేణి ప్రభావిత గ్రామాల్లో

# కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటన

- మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు
- సైలో బంకర్ పరిశీలన
- కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 4 :** సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు .శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయితో కలిసి మండలం లోని సింగరేణి ప్రభావిత కిష్టారం గ్రామంలో పర్యటించారు. కాలుష్యం, బాంబు పేలుళ్ళు,అకాల వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు.సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన సైలో బంకర్ ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు. నీరు, వాయు, ఇతరత్రా కలుషితం అవుతున్నాయని అక్కడివారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సింగరేణి భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది చేసే త్యాగాల కారణంగా అందరికీ లాభం లాభాలు వస్తున్నాయన్నారు. త్యాగాలు చేసిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉంటుందని అన్నారు.

సైలో బంకర్ నుంచి వచ్చే కాలుష్యాన్ని మరింత అరికట్టేందుకు సింగరేణి జీఎం తో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాలుష్య ప్రభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు.

బ్లాస్టింగ్, వర్షాల కారణంగా ఇండ్లు శిథిలావస్థలో ఉండటం గమనించానన్నారు. వాటిని అక్కడే తిరిగి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సింగరేణి జిఎం వద్ద ఇప్పటికే ఇండ్ల నిర్మాణం కోసం కొన్ని నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మిగిలిన నిధులను విడుదల చేయించి ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభం అయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, వైకుంఠ దామాలు, త్రాగునీటి సరఫరా, మొదలగు సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కొడతామన్నారు.ఆ దిశగా సింగరేణి సంస్థతో కలిసి పని చేస్తామని అన్నారు.

పాఠశాలలో ఉన్న విద్యార్థుల కోసం డిజిటల్ క్లాసు రూమ్, వంట గదులు, సోలార్ ప్యానెల్స్ మొదలగు సౌకర్యాలను వెంటనే కల్పించాలని అన్నారు. రాబోవు తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత మనపై ఉందన్నారు. ఆ దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. అవకాశం ఉన్న మేరకు ప్రతి పని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ఓపెన్ కాస్ట్ మైనింగ్ వచ్చిన తర్వాత కిష్టారం గ్రామం రూపురేఖలు మారాయన్నారు. అప్పటికి ఇప్పటికీ ఉన్న తేడాను మనందరం గమనించామన్నారు. ఇక్కడి పరిస్థితులు మెరుగుపరచడం కోసం వాగ్దానం చేశామన్నారు. ప్రజలకు సంక్షేమం, ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు.ఆ ఉద్దేశంతోనే ఈ సమస్యను అసెంబ్లీలో లేవ నెత్తడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకు వెళ్లడం ద్వారా కొన్ని చర్యలు తీసుకున్నారన్నారు. వర్షాకాలంలో చాలా ఇండ్లు దెబ్బ తిన్నాయన్నారు.ప్రజలు ఇండ్లలో ఉండలేని పరిస్థితి ఉందన్నారు. ప్రత్యేక సర్వే నిర్వహించి అందరికీ న్యాయం చేయాల న్నారు. సైలో బంకర్ ద్వారా కలిగే కాలుష్యాన్ని తగ్గించ్దే చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. అంబేద్కర్ నగర్, ఎస్సీ, బీసీ కాలనీలోని ఇండ్ల పరిస్థితులను జిల్లా కలెక్టర్ పరిశీలించారన్నారు. ప్రజల సమస్యలను గమనంలోకి తీసుకుని సత్వర పరిష్కారం చూపాలని అప్పటి వరకు ప్రజలకు అండగా ఉండాలని కలెక్టర్ ను కోరారు. పట్టణ పరిధిలోని జలగం నగర్, వెంగళరావు నగర్, ఎన్టీఆర్ నగర్ లో సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ ల వల్ల బీటలు వారిన ఇళ్లను జిల్లా కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వర రావు, ఎంపిడిఓ చిన్న నాగేశ్వరరావు, సింగరేణి అధికారులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు,చల్లగుళ్ళ నరసింహారావు, గాదే చెన్నకేశవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.







## బతుకమ్మ మన సంస్కృతికి దర్పణం

### సింగరేణి సిఎండి బలరాం





**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ కార్పోరేట్ ఏరియా ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ ఏరియా పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ లలో పని చేసే మహిళా ఉద్యోగులు వైభవముగా బతుకమ్మ సంబురాలలో బతుకమ్మ ఆటాపాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.బలరామ్, మాట్లాడుతూ మహిళా ఉద్యోగులందరికి బతుకమ్మ పండుగ చేసుకునే సింగరేణి వ్యాప్తముగా గల మహిళా ఉద్యోగినులకు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ ఇంతమంది మహిళలు ఒక్క చోట ఈ బతుకమ్మ పండుగ లో పాల్గొనటం చాలా సంతోషం అని, తెలంగాణ ఆడపడుచులు అపురూపంగా జరుపుకునే గొప్ప వేడుక బతుకమ్మ అని, మన సంస్కృతికి ఇది దర్పణంగా నిలుస్తుందన్నారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో ఈ రోజు ముద్ద పప్పు బతుకమ్మ ను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తదుపరి ఈ బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న మహిళలు తెచ్చిన బతుకమ్మలలో న్యాయ నిర్ణేతలు ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ పాల్గొన్న అందరికీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ చేతుల మీదుగా ప్రోత్యహక బహుమతులు ప్రదానం చేశారు. డైరక్టర్(పి అండ్ పిఅండ్ పా) జి.వేంకటేశ్వర రెడ్డి, డి.హరిణి సత్యనారాయణ, జి. సునీతా వేంకటేశ్వర రెడ్డి, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, సిఎంఓఏఐ కార్పొరేట్ ప్రెసిడెంట్ ఎం .విజయ భాస్కర్ రెడ్డి, డిజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డివై.పిఎం లు కే.శివ కుమార్, జికే.కిరణ్ కుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, అధికారులు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు

## డిజిటల్ కార్డు సర్వే పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా నవభూమి ప్రతినిధి-** శంషాబాద్ మండలం పెద్దతుప్రా తండాలో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వేను ఆయన ఈరోజు పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేలో గ్రామస్తులందరూ తమ కుటుంబ సభ్యుల వివరాలు సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. ఈ డిజిటల్ కార్డు ద్వారా భవిష్యత్తులో కుటుంబ సభ్యులకు అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సులువు అవుతుందని ఆయన అన్నారు.పైలట్ ప్రాజెక్టు కింద ఈ తండా ఎంపీగా చేశారని, దీంట్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించి రాష్ట్రమంతా ఈ డిజిటల్ కార్డులను ప్రవేశపెట్టనున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తన్విరాజ్, మండల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు

## ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.6లక్షల చెక్కులు అందజేత

- మున్సిపల్ కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాం
- ఎమ్మెల్యే కూనంనేని





**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** విధి నిర్వహణలో విద్యుత్ ప్రమాదానికి గురైన మున్సిపల్ కార్మికుడు దుర్గ ప్రసాదుకు, అవగాహనా లోపంతో దోమలమందు త్రాగి మృతిచెందిన బత్తుల ఓదెమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలతో మున్సిపాలిటీ నుంచి శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇరువురికి రూ.3 లక్షల చొప్పున రూ.6లక్షల విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖ, గ్రామ పంచాయతి శాఖలో పని చేస్తున్న కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని తెలిపారు. కార్మికులకు కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, కార్మికులు ప్రమాదాల భారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు పాటించాలని, కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరిగినా అధికారులే బాధ్యత వహించాల్సివుంటుందని హెచ్చరించారు. పర్యవేక్షణతో మున్సిపల్, గ్రామపంచాయతీల్లో పనులు జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, చైర్ పర్సర్ కాపు సీతా లక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సూచన మేరకు మృతురాలు బత్తుల ఆదెమ్మ కుటుంబంలో ఒకరికి మున్సిపల్ శాఖలో ఉద్యోగం కల్పించారు.

## వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం





**పుయ్యూరు శ్రీనివాసరావు**

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 3 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా క్రోధీనామ సంవత్సర శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములను గురువారం దాతలు, అర్చకులు,ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభించారు.శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు స్వామివారికి సర్వాంగాభిషేకము,స్వామివారికి, అమ్మవార్లకు నూతన వస్త్రాల అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4-30 నిమిషములకు చిత్తా నక్షత్రం మకర లగ్నమున శుభమంత్రోచారణలు, మంగళ వాయిద్యములు, భక్తుల గోవింద నామస్మరణల మధ్యన స్వామి వారి కోనేటి నుండి ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు తీర్థం బిందె తీసుకొని వచ్చి యాగశాల ప్రవేశము కార్యక్రమం నిర్వహించడంతో నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ప్రారంభ సూచికగా సాయంత్రం 6-30 నిమిషములకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్ర మూర్తి,కార్యనిర్వా హణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు- నిర్మల కుమారి దంపతులు, వేమిరెడ్డి వెంకట రెడ్డిల చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగినది.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మమాట్లాడుతూ "కలౌ వెంకట నాయకః" అని స్తుతించబడు కళ్యాణ దాముడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు స్వయంగా వెలిసిన పరమ పవిత్ర ప్రాచీన పుణ్యక్షేత్రం జమలాపురం వెంకటేశ్వర స్వామి వారి ఆలయం అని అన్నారు.ఈ ఆలయంలో స్వామి వారు సాలగ్రామ శిలా రూపమున వెలసి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా చుట్టు ప్రక్కల ప్రాంత ప్రజలకు ఇలవేల్పుగా ఆరాధ్య దైవంగా వెలుగొందుతూ వారి కామితార్థముల నీడేర్చుచూ కోరినవారి కొంగుబంగారమై భక్తుల పాలిట కల్పతరువై సకల మొక్కుబడులు పొందుతూ నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా సకల వైభవములతో వెలుగొందు చున్నారని తెలిపారు.నేటి నుండి 12వ తారీకు శనివారం ఈ దివ్య క్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములు క్షేత్ర సాంప్రదాయ అనుసారం జప,తప,అర్చన, హోమాధికారములతో వైభవంగా నిర్వహిస్తారని 9వ తేదీ మూలాన నక్షత్రం నుండి 11వ తేదీ మహార్నవమి వరకు భక్తులచేత సామూహికంగా శ్రీ చండీ మహాయాగం నిర్వహించనున్నామని తెలిపారు.ప్రతి రోజు అమ్మవారిని వివిధ దేవత రూపాలలో అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు ఇట్టి పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి అమ్మవారి కృపాకటాక్షములకు పాత్రులు కాగలరని అన్నారు. శుక్రవారం అమ్మవారిని బాలా త్రిపుర సుందరి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలోవేద పండితులు,అర్చకులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 4 (నవభూమి ప్రతినిధి):** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని ఆయన మాల్ గ్రామ పంచాయతలో వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్న 33 మంది సిబ్బందికి శుక్రవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా ప్రజా ఆరోగ్యం కోసం అహర్నిశలు పనిచేస్తారని, వారి శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. కార్మికులకు అందవలసిన సౌకర్యాలు గత ప్రభుత్వం అమలు చేయక సంవత్సరాల తరబడి కార్మికులు వేచి చూశారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి సేవలను గుర్తించి సమస్యలను పరిష్కరించడంతోపాటు కనీస వేతన పెంపు అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు.

# శ్రీ కోట మైసమ్మ తల్లి దేవాలయం తల్లాడలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**తల్లాడ, నవభూమి, అక్టోబర్ 4:** తల్లాడ లో కొలువైయున్న శ్రీ కోట మైసమ్మ దేవాలయం నందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు సందర్భంగా శ్రీ గాయత్రీ దేవి అలంకారం. భక్తులందరికీ తెలియజేయునది ఏమనగా దసరా సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవాల్సింది గా కోరుచున్నాము. పూజ అనంతరం భక్తులు దర్శనం ఇచ్చిన శ్రీ గాయత్రీ దేవి అమ్మవారు . ఈ శరన్నవరాత్రి సందర్భంగా దేవాలయ చైర్మన్ లగడపాటి నెహ్రూ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసామని తెలియజేశారు పూజ చేయించుకుని భక్తులు శ్రీ బ్రహ్మ ఋషి కంచల సతీష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించెదరు. కావున భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో భక్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్న పాలకులు

**సేవాలాల్ సేన ఇల్లందు మండల అధ్యక్షులు వాంకుడోత్ రమేష్ నాయక్**



**ఇల్లెందు రూరల్ అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** ప్రజా సమస్యలను నేటి కాంగ్రెస్ పాలకులు ప్రక్క దారి పట్టిస్తున్నారని సేవా లాల్ సేవా ఇల్లెందు మండల అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. అయ్యా సీఎం రేవంత్ రెడ్డి గారు మీరు చెప్పిన దసరా పండుగ కూడా ఎన్నో రోజులు లేదు, దసరా పండుగ వచ్చినప్పటికీ రైతులకు రైతుబంధు ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వడానికి పది పదిహేను రోజుల సమయం ఉన్నప్పటికీ రైతు భరోసా రెండు సీజన్లు కలిపి ఒక ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున ఎటువంటి షరతులు లేకుండా 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ ఇప్పటిదాకా పూర్తిస్థాయిలో చేయకుండా పెండింగ్ ఉన్న రైతులకు ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులు రెండు లక్షల 20 వేల పైచిలుకు రైతులు ఉన్నప్పటికీ కేవలం 57 వేల పైచిలుకు రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించింది. మిగతా రైతులకు రెండు లక్షల పైచిలుకు ఉన్న రైతులకు రెండు లక్షల రూపాయలు మినహాయించి పై ఉన్న డబ్బులను రైతు బ్యాంకుల్లో జమ చేసినప్పటికీ రుణమాఫీ బ్యాంకుల్లో జమ చేయలేదు. అలాగే మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ కూడా ఇప్పటిదాకా ప్రస్తావనలో లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, రైతు భరోసా వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలని సేవాలాల్ సేన నాయకులు డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు జరపల రామచంద్రనాయక్, జరపలా మంగీలాల్ నాయక్, జిల్లా కార్యదర్శి బోడ రమేష్ నాయక్, రైతు సేన అధ్యక్షులు బద్రునాయక్, ఇల్లందు మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# పేద కుటుంబాల బాధ్యతను ప్రభుత్వం స్వీకరించడం అభినందనీయం

- హామీకి కట్టుబడి రూ.లక్షా 116 అమలు చేస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే కూనంనేని





**కొత్తగూడెం అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** ఆడపిల్లలున్న పేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకం ఆర్థిక భరోసా అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపికైన 66 లబ్ధిదారులకు రూ.66,07,656ల విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో అయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు వివాహాలు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఆసరాగా నిలుస్తుందని, ఆడపిల్లల జీవితాలకు భరోసా కల్పిస్తోందన్నారు. లబ్దిదారులకు రూ.లక్షా ,116లు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తోందని, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహ భాద్యతను ప్రభుత్వం స్వీకరించడం అభినందనీయమన్నారు. పథకం అమలులో సాంకేతిక లోపాలుంటే సరిచేసి త్వరితగతిన ఆర్థికచేయూత అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, చైర్ పర్సన్ కే సీతామహాలక్ష్మీ, తహశీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, కమిషనర్ శేషాంజన్ స్వామి, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రోత్సవ పూజలు

- బాల త్రిపుర సుందరిగా అమ్మవారి అలంకారం







**ఎర్రుపాలెం, నవభూమి, అక్టోబర్ 4 :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవము లు ఘనంగా నిర్వహిస్తు న్నారు.ఉత్సవములలో భాగంగా శుక్రవారం రెండో రోజు ప్రాత:కాల అర్చనలు, యాగశాల యందు ఆవాహిత దేవత పూజలు, జపములు,మండపారాధ నలు ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వేదపండి తులు,అర్చకులు నిర్వహించారు.అనంతరం ఉదయం 10 గంటల నుండి కలశస్థాపన,11 గంటలకు గణపతి హెూమం,గోపూజ నిర్వహించారు.దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మ వారిని బాల త్రిపుర సుందరి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.ఎర్రుపాలెం గ్రామానికి చెందిన చీదెళ్ల వెంకట రమణ దంపతులు పద్మావతి అమ్మవారికి ముత్యాల కవచం తయారు చేయించి ఆలయ అధికారులకు అప్పగించారు.శ్రీ పద్మావతి అమ్మవారు,శ్రీ అలివేలు మంగమ్మ వార్లకు ముత్యాల కవచములు ధరింపజేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో భక్తులకు అందించే ఉచిత మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు 200 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.శనివారం దుర్గాదేవి అమ్మవారిని గాయత్రీ దేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ తెలిపారు.ఈ కార్య క్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి,ఆలయ పర్యవేక్షకులు కె.విజయ కుమారి,ముఖ్య అర్చకులు ఉప్పల మురళి మోహన శర్మ దంపతులు,వేద పండితులు విజయ కృష్ణ,అనంత శయన చార్యులు,సాయి అభిలాష్,వసంత కుమార్ శర్మ,అర్చకులు రాజీవ్ శర్మ,రమణ బాబు, రఘురామకృష్ణ శాస్త్రి, సుబ్రహ్మణ్య శాస్త్రి, సుదర్శనశాస్త్రి,చక్రధర్, రామకృష్ణ శాస్త్రి,సిబ్బంది, భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు ఉద్దెమర్రి ఆలయంలో చండీ హెూమం

- చైర్మన్ అడెపు ఉమామహేశ్వరి మనవి

**శామీర్‌పేట, అక్టోబర్ 04 (నవభూమి ప్రతినిధి) :** దేవి శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా ఉద్దెమర్రి శ్రీ విష్ణు, శ్రీ శివాలయం ( అక్కన్న మాదన్న దేవాలయం) లో చండీ హెూమం జరుపుతున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అడెపు ఉమామహేశ్వరి తెలిపారు. చండీ హెూమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందగలరని ఆమె మనవి చేశారు. మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని అతి పురాతన మహిమాన్వితమైన ఈ ఆలయంలో శనివారం ఉదయం 11 గంటల నుండి చండీ హవన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. అమ్మవారు ఆది పరాశక్తి అన్న విషయం తెలిసిందే. చండీ మాత ఓ ప్రచండ శక్తి, భూగ్రహంపై మాత్రమే కాకుండా విశ్వాంతరాళాలని అంటిపెట్టుకునే ఉంటుంది. సృష్టి జరగడానికి, అది వృద్ధి చెందడానికి, తిరిగి లయం కావడానికి అవసరమైన శక్తి అంతా అమ్మవారి లోనే ఉంది. అమ్మవారు ఆదిశక్తి, పరాశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, కుండలినీ శక్తి! అందుకే ఆమెకు అంత ప్రాధాన్యం. లోక రక్షకులైన అమ్మవారి స్వరూపాల్లో చండీ ఒకటి. లోక కల్యాణం కోసం, విశేష కార్యసిద్ధి కోసం సకల చరాచర జగత్తు సృష్టికి, స్థితికి, లయకు మూల కారణమైన జగన్మాతను ఆరాధించడం అనాదిగా వస్తోంది.

# సింగభూపాలెం చెరువు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**సుందరీకరణ, అభివృద్ధికి రూ.8.50కోట్లు మంజూరు**

**సీతారామ ప్రాజెక్టు నీళ్లు నియోజకవర్గ రైతులకు అందించాలి**

**చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో కూనంనేని**





**కొత్తగూడెం (సుజాతనగర్ ) అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** సింగభూపాలెం చెరువు అభివృద్ధికి, సుందరీకరణ కోసం 8.50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువులో ప్రభుత్వం నుండి వంద శాతం ఉచితంగా ఒక లక్ష చేప పిల్లలను వారి చేతుల మీదుగా చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ సింగభూపాలెం చెరువు కాకతీయుల నాటి పురాతనమైన చెరువని, ఈ చెరువు ఆధారంగా వేలందిమంది రైతులు ఉపాధి పొందుతున్నారన్నారు. సీతారామసాగర్ నీటి ద్వారా ఈ ప్రాంతంలో రెండువేల ఎకరాలకు నియోజవర్గం మొత్తం 25 వేల ఎకరాల సాగునీరు అదనంగా అందించడం కోసం కృషి జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిలో భద్రాద్రి జిల్లాలను, కొత్తగూడెం నియోజకవర్గాన్ని వదిలి సీతారామప్రాజెక్టు నీళ్లు ఇతర ప్రాంతాలకు వెళ్లనీయమన్నారు. రైతులకు నీటి వసతి చాలా ప్రధానమైనదని రెండు పంటలకు నీరు అందించడం కోసం ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖ మంత్రులతో మాట్లాడి నియోజవర్గం మొత్తం నీటి సమస్యలు లేకుండా చెరువులు కాలువల అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామని కాలువలు అభివృద్ధి కోసం సుమారు వంద కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే టెండర్లను పిలుస్తారన్నారు . సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్ నాయకులగూడెం, కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, లక్ష్మీదేవిపల్లి, గ్రామపంచాయతీలను కార్పొరేషన్లో విలీనం చేస్తామన్నారు. ఈ ప్రక్రియవల్ల ఎవరికి ఎలాంటి నష్టం జరగదని, మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె షాబీర్ పాషా, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, పిఏసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, మత్స్యశాఖ అధికారి డిడి ఖదీర్ అహ్మద్, మత్స్య శాఖ జిల్లా అధికారి ఇంతియాజ్, జిల్లా అధ్యక్షులు బుచ్చన్న, ఎంపీఓ శ్రీనివాస్, ఏవో నర్మదా, సిపిఐ జిల్లా నాయకులు సభ్యులు భూక్య దస్రు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, స్థానిక నాయకులు తాళ్లూరు పాపారావు ధర్మారావు, తాళ్ల వెంకటేశ్వర్లు, వీర్ల దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, మేకల వెంకటేష్, దండు సురేష్, దండి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో

# విద్యార్థినులకు ఓరియన్టేషన్ ప్రోగ్రాం

- **పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**









**పాల్వంచ అక్టోబర్ 4 నవభూమి ప్రతినిధి:** పట్టణ పరిధి లోగల అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు శుక్రవారం ఘనంగా ఓరియన్టేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన విద్యార్థినులను అభినందిస్తూ, భావిభారత పునాది రాళ్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవాలని కోరారు. ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో అకుంఠిత దీక్షతో చదివి మంచి స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా మాట్లాడుతూ విద్యార్థులలో అనంతమైన ప్రతిభ దాగి ఉంటుందని, కళాశాల వనరులను వినియోగించుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ తలసిల భరత్ కృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా విద్యార్థుల ఇష్ట ఇష్టాలను గ్రహించి, వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే మొట్ట మొదటి అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, దీనికి కృషి చేసిన కాలేజీ సిబ్బందిని అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్ వి సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, విద్యార్థులు అవకాశాలు వినియోగించుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవి మాట్లాడుతూ కళాశాల విధివిధానాలను విద్యార్థినిలకు వారి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సాంబశివరావు ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి వెంకన్న, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థులతో స్వచ్ఛతహి సేవ

- **పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన**
- **కెసిఆర్ నగర్ యూత్ క్లబ్**





**కల్లూరు, నవభూమి, అక్టోబర్ 4:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో, కెసిఆర్ నగర్ యూత్ క్లబ్ వారు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ 16 రోజుల స్వచ్ఛతహి సేవలో భాగంగా విద్యార్థులతో కళాశాల నుండి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు పరిసరాలు శుభ్రపరచడంతో పాటు విద్యార్థులతో స్వచ్ఛత సేవ ప్రతిజ్ఞ చేయించినట్లు వివరించారు. అనంతరం ఖమ్మం నెహ్రూ యువ కేంద్రం వారు విద్యార్థులకు స్వచ్ఛత కిట్ లో భాగంగా మై భారత్ లోగో కలిగిన పెన్ , నోట్ బుక్, క్యాప్ ఇచ్చి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అకౌంట్స్ మరియు ప్రోగ్రామ్ అధికారి కమ్మర్తపు భానుచందర్, కెసిఆర్ నగర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కూతుంభాక శ్రీనివాస రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి వీరభద్రం, కళాశాల అధ్యాపకులు షేక్ షకీలా బాను, శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, వరలక్ష్మి, ప్రసన్న,పుల్లారావు, శ్రీరాములు, జ్యోతి, బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కళాశాల యాజమాన్యానికి నెహ్రూ యువ కేంద్రం వారు ధన్యవాదాలు తెలిపింది.